వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF VANDE BHARATH
శనివారం, ఆగస్టు 29, 2026

# వైద్య పరికరాల కొనుగోళ్లలో పారదర్శకత ఉండాలి

- హైదరాబాద్ జిల్లా కలెక్టర్ డా.ప్రియాంక అలా
- అందుబాటులోని పరికరాలకు తప్పనిసరిగా మరమ్మతులు చేయాలి
- హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలి



**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రోగుల వాస్తవ అవసరాలు, వైద్య సేవల ఆధారంగానే పరికరాల కొనుగోళ్లు చేపట్టాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ డా. ప్రియాంక అలా వైద్యాధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్‌లోని కింగ్ కోఠి జిల్లా ఆసుపత్రిలో ఆసుపత్రి అభివృద్ధి సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. సంతోష్ బాబు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. పి. శ్రీనివాస్‌లతో కలిసి ఆసుపత్రి పనితీరు, అభివృద్ధి అవసరాలపై ఆమె సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా వైద్య విభాగాల వారీగా అజెండాను పరిశీలించిన కలెక్టర్, వైద్య పరికరాల కొనుగోళ్లు, మరమ్మతులు, నిర్వహణ మరియు మౌలిక వసతుల అభివృద్ధిపై చర్చించారు. ప్రతి విభాగంలో కేసుల సంఖ్య, అందిస్తున్న చికిత్సల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి కేటాయించిన బడ్జెట్, వ్యయాలను సమీక్షిస్తూ.. అనవసరమైన లేదా వృథా వ్యయానికి తావులేకుండా సముచితంగా కొనుగోళ్లు చేపట్టాలని స్పష్టం చేశారు. ఇప్పటికే అందుబాటులో ఉన్న పరికరాలను సాధ్యమైన మేరకు మరమ్మతులు చేసి పునర్వినియోగంలోకి తీసుకురావాలని, కొత్త పరికరాల కొనుగోలుకు ముందు ప్రస్తుత పరికరాల పరిస్థితిని పరిశీలించాలని సూచించారు. భవిష్యత్తులో కొనుగోళ్ల సమయంలో తగిన వారంటీ, అమ్మకాల అనంతర సేవలు (ఆఫ్టర్ సేల్స్ సర్వీస్) అందేలా నిబంధనలు ఉండాలని ఆదేశించారు. ఆసుపత్రిలోని విద్యుత్ పనులు, ప్లంబింగ్, పరిశుభ్రత తదితర సివిల్ మౌలిక వసతులపై కూడా అధికారులతో చర్చించారు.

## ఐఈసీ ప్రచార వాల్ పోస్టర్ ఆవిష్కరణ

ఆగస్టు 12 నుంచి అక్టోబర్ 12 వరకు నిర్వహిస్తున్న తీవ్రతరం చేసిన ఐఈసీ ప్రచారం–2026కు సంబంధించిన వాల్ పోస్టర్‌ను కలెక్టర్ ఈ సందర్భంగా ఆవిష్కరించారు. తెలంగాణ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ (టీజీఎస్ఏసీఎస్) ఆధ్వర్యంలో యువతలో హెచ్‌ఐవీ/ఎయిడ్స్, లైంగికంగా సంక్రమించే వ్యాధులు (ఎస్‌టీఐ), సిఫిలిస్ వంటి అంశాలపై విస్తృత అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని పేర్కొన్నారు. పాఠశాలలు, కళాశాలలు, యువత ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రజలు సమీపంలోని ఆరోగ్య కేంద్రాలను సంప్రదించి సకాలంలో పరీక్షలు, చికిత్స పొందాలని సూచించారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌వో డా. పుట్ల శ్రీనివాస్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. సంతోష్ బాబు, ప్రోగ్రామ్ ఆఫీసర్లు డా. సుధీర్ కుమార్, డా. రాంబాబు నాయక్, టీజీఎంఎస్ఐడీసీ (టీజీఎంఎస్ఐడీసీ) ఇంజినీర్లు, వివిధ విభాగాల వైద్యాధికారులు, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, డిశా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ‘పాంచజన్య సంకల్ప సభ’ ఏర్పాట్లు ముమ్మరం

**ప్రత్యేక పర్యవేక్షణలో డా. రఘు**



**నిజామాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో ఆగస్టు 31న నిజామాబాద్ కలెక్టరేట్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న ‘పాంచజన్య సంకల్ప సభ’ ఏర్పాట్లు చివరి దశకు చేరుకున్నాయి. సభ ఏర్పాట్లపై పర్యవేక్షకులు, కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి డా.రఘు ప్రత్యేక దృష్టి సారించి, దగ్గరుండి పనులను పర్యవేక్షిస్తున్నారు. శుక్రవారం సభా ప్రాంగణాన్ని పరిశీలించిన ఆయన, శనివారం కూడా గ్రౌండ్‌ను సందర్శించి ఏర్పాట్ల పురోగతిని క్షుణ్ణంగా సమీక్షించారు. వేదిక నిర్మాణం, ప్రజలకు అవసరమైన తాగునీరు, నీడ వసతి, వాహనాల పార్కింగ్, నాయకులు–కార్యకర్తల రాకపోకల ఏర్పాట్లను పరిశీలించారు. స్థానిక నాయకులు, నిర్వాహక బృందాలతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ పనులను వేగవంతం చేశారు. సభకు భారీ సంఖ్యలో తరలివచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని నిర్వాహకులకు రఘు స్పష్టం చేశారు. ప్రతి విభాగం సమన్వయంతో పనిచేసి ‘పాంచజన్య సంకల్ప సభ’ను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.



# ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేయాలి



- ఎమ్మెల్యే నవీన్ యాదవ్
- డివిజన్ అధ్యక్షులు, బూత్ ఇన్‌చార్జ్‌లతో సమావేశం
- అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఎస్ఐఆర్ ప్రక్రియపై యూసుఫ్ గూడా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డివిజన్ అధ్యక్షులు, బూత్ ఇన్‌చార్జ్‌లతో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నవీన్ యాదవ్ మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ ప్రక్రియపై పార్టీ శ్రేణులు, డివిజన్ అధ్యక్షులు, బూత్ ఇన్‌చార్జ్‌లు పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రతి బూత్ పరిధిలో అర్హులైన ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన సహాయ సహకారాలు అందించాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ఓటర్ల నుంచి వచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటిని సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియ విజయవంతంగా పూర్తయ్యేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కు పరిరక్షణే లక్ష్యంగా అందరూ ఐక్యంగా ముందుకు సాగాలని ఎమ్మెల్యే నవీన్ యాదవ్ స్పష్టం చేశారు.

# సంగారెడ్డిలో ఇక కాంగ్రెస్‌దే హవా

- జగ్గారెడ్డి సంచలన వ్యాఖ్యలు
- రానున్న పదేళ్లు కాంగ్రెస్‌దే ఎమ్మెల్యే స్థానం
- భవిష్యత్‌లోనూ ప్రత్యర్థులకు అవకాశం ఇవ్వబోమన్న జగ్గారెడ్డి
- డబ్బులతోనే గెలవలేమన్న కాంగ్రెస్ సీనియర్ నేత



**సంగారెడ్డి, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** సంగారెడ్డి రాజకీయాలపై కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సంగారెడ్డిలో ఇక కాంగ్రెస్‌కు తప్ప మరో పార్టీకి అవకాశం ఉండదని స్పష్టం చేశారు. రానున్న పదేళ్ల పాటు ఇక్కడ ఎమ్మెల్యేగా కాంగ్రెస్ పార్టీకి చెందిన వారే గెలుస్తారని, ఆ తర్వాత కూడా మరెవరికీ అవకాశం ఇవ్వకుండా గట్టిగా కష్టపడతామని తేల్చిచెప్పేశారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తన భార్య నిర్మల బరిలో నిలుస్తారని, ఆ తర్వాత జరిగే ఎన్నికల్లో ఆంజనేయులు పోటీ చేస్తారని జగ్గారెడ్డి వెల్లడించారు. తాను స్వయంగా ఎన్నికల్లో పోటీ చేస్తే గెలుపు కోసం అంతగా కసిగా పనిచేయలేమో కానీ, తన పార్టీ అభ్యర్థి గెలుపు కోసం మాత్రం ఎంతో కసిగా శ్రమిస్తానని ఆయన పేర్కొన్నారు. సంగారెడ్డి రాజకీయాల్లో ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు, వ్యూహాలు పన్నినా వాటిని రాజకీయంగా తిప్పికొడతామని హెచ్చరించారు. ఎవరెన్ని డైలాగులు కొట్టినా, ప్రత్యర్థులు సర్వం ఒడ్డి పోరాడినా తాను గీసిన రాజకీయ డిజైన్ ముందు వారి వ్యూహాలు ఏమాత్రం పనిచేయవని స్పష్టం చేశారు. డబ్బులు ఉంటేనే రాజకీయాల్లో గెలవగలం అనుకోవడం కేవలం భ్రమని జగ్గారెడ్డి అభిప్రాయపడ్డారు. తాను గతంలో కౌన్సిలర్‌గా, మున్సిపల్ చైర్మన్‌గా, ఆ తర్వాత మూడు సార్లు ఎమ్మెల్యేగా ఎలాంటి డబ్బులు లేకుండానే ప్రజల ఆశీస్సులతో గెలుపొందానని గుర్తుచేశారు. సాధారణ సమయాల్లోనూ రాజకీయాలకు అతీతంగా ఆపదలో ఉన్నవారికి ఆర్థికంగా సహాయం అందించానని తెలిపారు. రాజకీయాల్లో డబ్బులు ఏదో ఒకసారి ప్రభావం చూపవచ్చు కానీ, అన్నిసార్లు అవే గెలిపించలేవని ఆయన తేల్చిచెప్పారు.